క్లుప్తంగా

తిరుచ్చిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా దేవదేవేరులకు కనుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం తిరుచ్చిపై ఉభయ దేవేరీ సమేతంగా స్వామివారిని కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్, ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

తిరుపతి రూరల్ : ఉబర్ యాజమాన్యం ఇబ్బంది పెడుతోందని, అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ క్యాబ్ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఈ మేరకు చైతన్యపురం వద్ద నిరసనకు దిగారు. అధికారులు వెహికల్ ఆడిటింగ్ చేపట్టాలని, ఉబర్ పేరుతో ఫేక్ ఐడీలు సృష్టించుకుని పలు వాహనాలు తిరుగుతున్నాయని ఆరోపించారు. గిరిబాబు, ఖాదర్ భాషా, రమేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఎల్లయ్య, భానుప్రకాష్, దొరబాబు, మురళి, మధుసూదన్ పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం



తహసున్నీసాను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : ఉయ్ సపోర్టు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నీషా బేగం సేవలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవారత్న అవార్డును శనివారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సోము రవి పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

తిరుపతి ఎడ్యుకేషన్ : మత్తుకు అలవాటు పడితే జీవితం చిత్తవుతుందని ఎక్సైజ్ ఎస్‌ఐ హరికృష్ణ హెచ్చరించారు. శనివారం కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈగల్ క్లబ్, సెట్విన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్య వినియోగంతో వాటిల్లే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెట్విన్ మేనేజర్ చక్రి నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఆర్‌వీ రమణ, విభాగాధిపతులు ఆర్. ఉదయ్‌కుమార్, ఎస్‌వీ గౌరీశంకర్, నటరాజ్ నాయుడు, పి.అపర్ణ పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు

తిరుపతి క్రైమ్ : జూనియర్ కళాశాలపై దాడి చేసిన ఏడుగురిపై శనివారం అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. పూలవాని గుంటలోని ఓ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు తనను తదేకంగా చూశారని ఓ మహిళ భర్త గిరీష్‌కు ఫిర్యాదు చేసింది. ఆగ్రహించిన భర్త మరో ఆరుగురితో కలిసి వెళ్లి కళాశాలలోని ఫర్నీచర్ ధ్వంసం చేశాడు. ప్రిన్సిపల్ సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

కొనుగోళ్లలో అప్రమత్తం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమేష్‌కుమార్

పాకాల : వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపల్ రమేష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాశిలామణి, రమణమ్మ, చిట్టికళావతి, మాధవి, వినోద్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో బాదుడు!

ఆర్టీసీలో బస్సు చార్జీలు పెంచడం చూశాం.. మరుగుదొడ్ల వద్ద నిలువు దోపిడీ చేయడం చూశాం.. దుకాణాల్లో తినుబండారాలను అధిక ధరలకు విక్రయించడం చూశాం.. అయితే బస్టాండ్ ఆవరణలో వాహనం పెడితే జరిమానా విధించడం.. సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించకుండా ప్రజలను ఇబ్బంది పెట్టడం.. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోనే చూస్తున్నాం.. సుమారు 13 ఎకరాల సువిశాల ప్రయాణ ప్రాంగణంలో ఎక్కడైనా బండిని పార్క్ చేయాలంటే ఇకపై ఆలోచించాల్సిందే.. పది నిముషాలు నిలబెట్టినా రూ.100 అపరాధం చెల్లించాల్సిందే.. సోమవారం నుంచి ఈ కొత్త నిబంధన కింద నగరవాసుల నడ్డి విరిచేందుకు ఆర్టీసీ అధికారులు సన్నద్ధమయ్యారు.

- ప్రాంగణంలో బండి పెడితే రూ.100 అపరాధం
- రేపటి నుంచి అమల్లోకి కొత్త నిబంధన
- ఉన్నది ఒక్కటే పార్కింగ్
- మరెక్కడ వాహనం పెట్టినా జరిమానా!
- ఆర్టీసీ అధికారుల వైఖరిపై ప్రజల ఆగ్రహం

బస్టాండ్ ప్రాంగణంలో పార్క్ చేసిన వాహనాలు



తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో ఎక్కడైన ఏ వాహనం అయినా పార్క్ చేస్తే రూ.100 జరిమానా చెల్లించాలని ఆర్టీసీ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ కొత్త రూల్ సోమవారం నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. బస్టాండ్‌కు బంధుమిత్రులను బస్సు ఎక్కించడానికి వచ్చిన వారు సైతం వాహనం పెట్టుకునేందుకు ఒప్పుకోమని అధికారులు తేల్చి చెబుతున్నారు. పది నిముషాలైనా సరే.. పార్కింగ్‌లోనే నగదు చెల్లించి వాహనాలను నిలబెట్టాలని స్పష్టం చేస్తున్నారు.

ప్రత్యేకంగా విధులు

బస్టాండ్ ఆవరణలో పార్క్ చేసే వాహనదారుల నుంచి జరిమానా వసూలు చేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఐదుగురు కండక్టర్లు, ఐదురుగు సెక్యూరిటీ సిబ్బందికి విధులు అప్పగించారు. ఎవరైనా వాహనం నిలిపిన వెంటనే దానిపై టైమ్ రాయాలని, ఆ మేరకు రూ.100 లేదా అంతకు మించి అపరాధం రాబట్టాలని ఆదేశించారు.

పార్కింగ్ ఒక్కటే!

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలో 64 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. రోజుకు 1.30లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాలే నిత్యం 10వేలకు పైగా వచ్చిపోతుంటాయి. అయితే ఆర్టీసీ ఆవరణలో ఒక్క పార్కింగ్ మాత్రమే ఏర్పాటు చేశారు. అందులో కేవలం 500 నుంచి 600 వాహనాలు మాత్రమే పార్క్ చేసే వీలుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన వాహనాలు ఎక్కడ పార్క్ చేయాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో నాలుగు పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం స్థలాలను సైతం ఎంపిక చేశారు. అయితే వాటికి టెండర్లు నిర్వహించలేకపోయారు. దీంతో ఒక్క కేంద్రం మాత్రమే నడుస్తోంది. పల్లె వెలుగు బస్టాండ్ సమీపంలోని మరోఏ పార్కింగ్ 9 నెలలుగా ఖాళీగా ఉంది. అద్దెకు ఇచ్చి ఉంటే ఇప్పటికే రూ.9లక్షలకు పైగా ఆర్టీసీకి రాబడి వచ్చేది.

ఈడీ ఆదేశాల మేరకే..



తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను ఈడీ అప్పలరాజు ఇటీవల పరిశీలించారు. బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు ఎక్కడ పార్క్ చేసినా రూ.100 చొప్పున జరిమానా వసూలు చేయాలని ఆదేశించారు. ఇకపై ఎవరైనా సరే పార్కింగ్‌లోనే నగదు చెల్లించి వాహనాలు పెట్టుకోవాల్సి ఉంటుంది. పది నిమిషాలు అయినా సరే తప్పదు. పల్లె వెలుగు బస్టాండ్ సమీపంలోని పార్కింగ్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. కొత్త నిబంధనను మాత్రమ సోమవారం నుంచి అమలు చేస్తున్నాం.

- రామచంద్రనాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్

నగరంలో నేడు

- పద్మావతిపురంలోని నివాసంలో ఉదయం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ప్రెస్‌మీట్.
- టీటీడీ పరిపాలన భవనం వెనుక మైదానంలో ఉదయం 9 గంటల నుంచి క్రీడా పోటీలు.
- యూత్ హాస్టల్‌లో ఉదయం 9 గంటలకు దళిత ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం. అలాగే తెలుగు కళారత్నాలు సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానం.
- ఏపీపీఎస్సీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పోస్టులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు.
- పట్నూల వీధిలోని రేణుకా పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పల్లకీసేవ. సాయంత్రం 6 గంటలకు పొంగళ్ల వేడుక.
- ఎస్వీ వేదిక్ వర్సిటీలో ఉదయం 10 గంటలకు ఆగమ సిద్ధాంతంపై సదస్సు.
- ఎస్వీయూ మైదానంలో క్రికెట్ పోటీలు.
- మ్యాంగో మార్కెట్ యార్డ్ ఎదుట ఉదయం 9 నుంచి పాత కార్ల ఎక్స్ఛేంజ్ మేళా.
- కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళా.
- ఎస్వీయూలో ఉదయం 10 నుంచి 'శేషాచలం- బయోడైవర్సిటీ సదస్సు'.

వెటర్నరీ వర్సిటీలో చిరుత హల్‌చల్

తిరుపతి సిటీ : వెటర్నరీ యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం రాత్రి చిరుతపులి సంచారం కలకలం రేపింది. ఈ క్రమంలో విద్యార్థులను అధికారులు అప్రమత్తం చేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా వెంకటరత్నం



చంద్రగిరి : ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఈఓపీఆర్‌డీ వెంకటరత్నం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఇమ్యునైజేషన్ డే



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి తుడా : అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వారు నేషనల్ ఇమ్యునైజేషన్ డే, మీజిల్స్ ఇమ్యునైజేషన్ డే నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వీసీ ఆర్‌వీ కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శాంతకుమారి, డీపీఎంఓ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళి, మహిళా వైద్యకళాశాల ప్రిన్సిపల్ ఉషా కళావత్, విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్ పాల్గొన్నారు.

28న న్యాయవాద సంఘం ఎన్నికలు

తిరుపతి లీగల్ : తిరుపతి న్యాయవాద సంఘం ఎన్నికలను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్టు కార్యవర్గ సభ్యులు తెలిపారు. శనివారం ఈ మేరకు కార్యవర్గ పదవులకు పోటీపడే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించినట్లు వెల్లడించారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది బి.ఉషా కిరణ్ వ్యవహరించనున్నట్లు వివరించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



వైఎస్సార్‌సీపీ నేతలతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా సమష్టిగా పనిచేద్దామని పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టోల్‌గేట్ వద్ద ఓ ప్రైవేట్ హోటల్‌లో స్థానిక నేతలతో సమావేశం నిర్వహించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విభేదాలను పక్కనపెట్టి, ప్రజా సంక్షేమం కోసం పోరాడాలని కోరారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వెల్లడించారు. అక్రమ కేసులకు భయపడాల్సిన పనిలేదని, జగనన్న స్ఫూర్తితో సమర్థవంతంగా ఎదుర్కొందామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. అనంతరం నేతలతో కలిసి ఆత్మీయ విందును ఆరగించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నంగా నరేష్‌రెడ్డి, నేతలు వల్లివేడు విక్రమ్‌రెడ్డి, రహీం, ఖాజామస్తాన్, హరిప్రసాద్‌రెడ్డి, మునీర్, కపిలీశ్వర్ రెడ్డి, గుండ్లూరి సురేష్, చంటి, యతీశ్వర్‌రెడ్డి, మధు, అన్నాబాబు, రవి, మురళి, ఋుకేష్‌రెడ్డి, నరేష్‌యాదవ్, గోపి, హరీష్, రాజేష్, పాల్గొన్నారు.

నాగరాజుకు పరామర్శ

చంద్రగిరి : అనారోగ్యంతో బాధపడుతున్న మిట్టపాళెం ఎంపీటీసీ మాజీ సభ్యుడు పసల నాగరాజును స్థానిక ప్రశాంతినగర్‌లోని ఆయన నివాసంలో మోహిత్ పరామర్శించారు. మెరుగైన వైద్యం చేయిస్తామని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపాటి కోటీశ్వర్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు తదితరులు పాల్గొన్నారు.

రేణుకా పరమేశ్వరికి సారె



సారె సమర్పిస్తున్న మేయర్ శిరీష దంపతులు

తిరుపతి కల్చరల్ : నగరంలోని పట్నూలు వీధిలో వెలసిన రేణుకా పరమేశ్వరి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఈ మేరకు మేయర్ డాక్టర్ శిరీష, డాక్టర్ మునిశేఖర్ దంపతులు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అమ్మవారికి పూజలు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే రాత్రి 7 గంటలకు రేణుకా పరమేశ్వరికి వేడుకగా పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ధనంజయ, కుప్పయ్య, హరిప్రసాద్, ప్రకాష్ బచ్చు, భూపతి, యుగంధర్, వేణుప్రసాద్ పాల్గొన్నారు.

అధ్వాన్నం..పారిశుద్ధ్యం



మాట్లాడుతున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ఆధ్యాత్మిక నగరంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలో అడుగు పెట్టగానే చెత్తకుప్పలు, మురుగే దర్శనమిస్తున్నాయన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లోని పారిశుద్ధ్య విభాగాల్లో వెయ్యిమంది మాత్రమే ఉన్నారని తెలిపారు. చెత్త సేకరణ, తరలింపునకు కావాల్సిన వాహనాలు కూడా అందుబాటులో లేవని వెల్లడించారు. అందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి ద్వారా టీటీడీ సహకారం కార్పొరేషన్‌కు అవసరమని విన్నవించినట్లు వివరించారు. ఆ సమయంలో టీడీపీ, జనసేన నేతలు స్వాగతిస్తే..బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి మాత్రం కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారన్నారు. ఏటా స్వచ్ఛ భారత్ మిషన్‌లో తిరుపతి కార్పొరేషన్‌కు అవార్డులు మాత్రం వస్తున్నాయే కానీ, పరిశుభ్రత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. టీటీడీ సహకారం తీసుకుంటే మరో 1,650మంది పారిశుద్ధ్య కార్మికులతో పాటు అవసరమైన వాహనాలు పొందగలమని తెలిపారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. తిరుపతి నగర అభివృద్ధికి తాము పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పాకాల : మండలంలోని దామలచెరువు, మొగరాల మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఊట్లవారిపల్లె సమీపంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లే దారిలో చేపట్టిన రోడ్డు, కల్వర్టు పనులను పరిశీలించారు. టీడీపీ మండల కన్వీనర్ నాగరాజనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, నేతలు సురేష్ చౌదరి, సోంపల్లి చంద్రశేఖర్‌నాయుడు, చాముండేశ్వరి, సావిత్రి, మోహన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'చిల్డ్రన్ కాన్ఫరెన్స్'



ప్రాజెక్టులను వివరిస్తున్న విద్యార్థులు

తిరుపతి తుడా : డాక్టర్ కిషోర్ రత్నం స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ చిల్డ్రన్ కాన్ఫరెన్స్ ఆకట్టుకుంది. అనంతరం నూతన ఆవిష్కరణలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ పురుషోత్తం రెడ్డి, మేనేజర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

● గుట్టుగా.. ఇసుక గుట్టలు!



చంద్రగిరి నియోజకవర్గంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా టీడీపీకి చెందిన ఓ కీలక నాయకుడి సమీప బంధువు ఇష్టారాజ్యంగా స్వర్ణముఖిని దోచేసుకుంటున్నారు. చివరకు శ్మశానాలను సైతం ఇసుక డంప్‌లుగా మార్చేసుకుంటున్నారు. తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల, చెర్లోపల్లె శ్మశాన వాటికలను ఇసుక నిల్వలతో నింపేశారు. కళ్లెదుటే గుట్టలు గుట్టలుగా ఇసుక కనిపిస్తున్నా.. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. సుమారు వారం రోజులుగా లారీల్లో ఇసుక తరలిపోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. సోషల్ మీడియాల్లో ఇసుక నిల్వల దృశ్యాలు వైరల్‌గా మారినప్పటికీ ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి టాస్క్‌ఫోర్స్

సహజసిద్ధ ఆహారంతో ఆరోగ్యం



వీసీ ఉమను సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సహజసిద్ధంగా పండించే ఆహారంతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు ప్రకృతివనం ప్రసాద్ తెలిపారు. శనివారం పద్మావతి మహిళా వర్సిటీ సావేరి హాల్‌లో సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ శారీరక శక్తికి త్రుణధాన్యాలతో పాటు రాగులు, సజ్జలను వినియోగించుకోవాలని సూచించారు. గూట్లో దీపం నోట్లో ముద్ద అన్న నానుడిని పాటించాలని కోరారు. తెల్లవారుజామునే నిద్ర లేచి చెమట పట్టేలా వ్యాయామం చేయాలన్నారు. జేసీఐ జోన్ చైర్మన్ గోపీ కిషోర్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం భూమిని రసాయనాల బారి నుంచి రక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం వర్సిటీ వీసీ ఉమను సత్కరించారు. రజనీ, శ్రీనివాసరావు, దుద్యాల చంద్రమోహన్, చక్రవర్తి రాఘవన్, శంకర్, సోమయ్య, స్వరాజ్యలక్ష్మి, త్రిపురసుందరి పాల్గొన్నారు.

మోహన్‌బాబుతో మోహిత్ భేటీ



మోహన్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : శ్రీ విద్యానికేతన్‌లో సినీ నటుడు మోహన్ బాబును వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శనివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

● స్వచ్ఛత.. అందరి బాధ్యత

రుయాలో..



ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో..





ఎస్వీడబ్ల్యూ కళాశాలలో..

తిరుపతి, చంద్రగిరిలోని పలు ప్రాంతాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. అయా చోట్ల పరిసరాలను పరిశుభ్రం చేశారు. చెత్తా చెదారాలను తొలగించి.. స్వచ్ఛతే లక్ష్యమని ప్రతిజ్ఞ చేశారు. ఈ క్రమంలోనే ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు అవగాహన ర్యాలీలు చేపట్టారు. పర్యావరణ హితమే తమ అభిమతమని నినదించారు.

- తిరుపతి సిటీ/ తిరుపతి తుడా/ తిరుపతి మంగళం/ చంద్రగిరి



మంగళంలో..